క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆరా



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పాలకొల్లు సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతీ బాలబాలికలకు అందాల్సిన సౌకర్యాలు తప్పనిసరిగా అందించాలని దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పాలకొల్లు వచ్చిన ఆమె అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. పథకాల అమలులో పారదర్శకత, వేగవంతం అవసరమని అధికారులకు సూచించారు.

కామ్రేడ్ వలవలకు ఘన నివాళి



శ్రీరామ్మూర్తికి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కామ్రేడ్ వలవల శ్రీరామ్మూర్తి ఆశయాల కోసం పని చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని మాజీ ఎమ్మెల్సీ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. ఆదివారం శ్రీరామ్మూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ రామ్మూర్తి సేవలను కొనియాడారు. అనంతరం శ్రీరామ్మూర్తి కుమారులు రవీంద్ర, రామకృష్ణలు పార్టీ కార్యాలయానికి 15 కుర్చీలు అందించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీనివాసరావు, తొట్టెంపూడి కోటేశ్వరరావు, చల్లా సోమేశ్వరరావు, కె.రాయపరాజు, యర్రా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పేద విద్యార్థికి సాయం అందచేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రతిభ కలిగిన పేద విద్యార్థికి శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని ఆదివారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేదరికం వల్ల అనేక మంది విద్యార్థులు విద్యకు దూరంగా ఉంటున్నారన్నారు. ఇలాంటి వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణానికి చెందిన కారుమూరి సాయి హరిణి ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులతోపాటు కడప ఇడుపులపాయలోని ప్రభుత్వ ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారని, మెరిట్ కలిగిన ఆ విద్యార్థి పేదరికంతో ఉండటంతో సీఐ నాగరాజు రూ 10 వేలు సహకారం అందించారని తెలిపారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డులోని రామాలయం వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 66వ జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. వాడవాడలా శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతరలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం శుభపరిణామన్నారు. అనంతరం అమ్మవారి జాతరను కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం మాజీ అధ్యక్షులు కొండ్రు శ్రీనివాస్, అయితం నరసింహ మూర్తి, కొర్ర రంగారావు, జి.శివరామ్, దువ్వి అప్పన్న, కిలారి కృష్ణప్రసాద్, గొలగని చంద్రరావు, కోరాడ శ్రీను, బర్ల శివ, గంటా బాబీ, గొలగని రమేష్, దేవర నరసింహమూర్తి పాల్గొన్నారు.

శృంగవృక్షంలో ఉచిత వైద్య శిబిరం



వైద్యం శిబిరంలో సేవలు అందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: సుగర్ వ్యాధి ఉన్న వాళ్లకే వేరికోస్ వేన్స్ సమస్యలు వస్తాయని, కాబట్టి సుగర్‌ను అదుపులో ఉంచుకోవడం చాలా అవసరమని ఎండోవాస్క్యులర్ సర్జన్ డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం శృంగవృక్షం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు వంద మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా కలర్ డాప్లర్ పరీక్షలు చేసి, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు.వీరందరిని బుధవారం హైదరాబాద్ తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తామని అన్నారు.

సమస్యల వాకిట్లో గ్రంథాలయాలు

- అధ్వానంగా మారిన వైనం
- ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగింపు

నరసాపురం: ప్రస్తుత పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ వినియోగం కారణంగా పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గిపోతుంది. ఇది మేధావుల నుంచి వేదికలు ఎక్కితే సందర్భాన్ని బట్టి మన నేతలు సైతం పదే పదే చెప్పేమాట. అయితే పుస్తకాలు చదివించడానికి, ఆసక్తి ఉన్న వారు చదవడానికి అనువుగా ఉండాల్సిన గ్రంథాలయాలు సమస్యల వాకిట్లో కొట్టిమిట్టాడుతున్నాయి. ఏడాదికి ఒకసారి జరిగే గ్రంథాలయ వారోత్సవాల సందర్భంలో గ్రంథాలయాల అభివృద్ధిపై హామీలు, చర్చలు సాగడం తప్ప ఇంకేమీ కనిపించడంలేదు. నరసాపురం నియోజకర్గంలో కూడా గ్రంథాలయాల పరిస్థితి అదేరకంగా ఉంది. డివిజన్ కేంద్రంలో ఉన్న ఈ గ్రేడ్–1 గ్రంథాలయం అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. 1954లో నరసాపురంలో గ్రంథాలయం స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్–1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతీరోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే భవనమే అసలు సమస్య. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో, బయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి గ్రూప్స్ నుంచి అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, విద్యార్థులు ఈ గ్రంథాలయానికి వస్తారు. అయితే వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ, ఇంకా మెరుగైన పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో పర్కురోడ్డులో సొంత లైబ్రరీ భవనానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారిని తరువాత పనులు నిలియిపోయాయి.



పట్టణంలో ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న నరసాపురం గ్రేడ్‌-1 లైబ్రరీ

గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణం

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో గ్రంథాలయాల పరిస్థితిమరింత దారుణంగా ఉంది. నరసాపురం మండలంలో 28 పంచాయితీలు ఉన్నాయి. అయితే ఎక్కడా గ్రంథాలయం అన్నదే లేదు. లక్ష దాటి జనాభా ఉన్న ఈ మండలంలో కనీసం న్యూస్ పేపర్లు చదువుకోవడానికి జాగా లేకపోవడం గమనార్హం. మొగల్తూరు మండల కేంద్రంలో గ్రేడ్–3 లైబ్రరీ ఉంది. ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న లైబ్రేరియన్ వస్తేనే, కొన్ని రకాల పుస్తకాలు చదువుకోవడానికి వీలుంటుంది. ఎందుకంటే ఆయన రూమ్‌లోనే ఆ పుస్తకాలు ఉంటాయి. పూర్తి స్థాయి లైబ్రేరియన్ నియామకం ఏళ్ల తరబడి చేయడంలేదు. ఈ గ్రంథాలయంలో ఒక అటెండర్‌పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సత్కారం

పెనుగొండ: సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నక్కా వేద వ్యాస శాస్త్రి, పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పెనుగొండ త్యాగరాజ గానసభలో నిర్వహించిన జడ్‌ఎన్‌వీఆర్ ఉన్నత పాఠశాల 1990–95 విద్యా సంవత్సర విద్యార్థులు సహపూర్వ విద్యార్థి శాస్త్రిని సత్కరించారు.

కొప్పర్రు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఆదివారం అందే నరీన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు త్రిసభ్య కమిటీ సభ్యులుగా కడలి మసేన్‌రావు, మెరుగుమువ్వల భాస్కర రామస్వామి బాధ్యతలు స్వీకరించార. త్రిసభ్య కమిటీ సభ్యులతో సొసైటీ కార్యదర్శి దొడ్డా లక్ష్మణరావు ప్రమాణస్వీకారం చేయించారు.

ఇంటికే ఉచిత వైద్యం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు, పాతవూరు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ప్రత్యేక వాహనంలో ఆరుగురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. అసోసియేషన్ సభ్యులు యడ్లపల్లి శివప్రసాద్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డున పడిన ఆటో కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్త్రీశక్తి పథకం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఆటోలు తిప్పుతున్న నిరుద్యోగులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఎంతో మంది ఉన్నత చదువులు చదువుకున్న వారు ఉన్నారని, గత 30 సంవత్సరాలుగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశం లేక యువత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబాలను పోషించే పరిస్థితి లేదని, బ్యాంకులు నుంచి రుణాలు తీసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఫ్రీ బస్సు కారణంగా ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కూటమి ప్రభుత్వానికి ధీ చెప్పాలన్నారు. ఆటో యూనియన్లుకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పొట్ల విజయ కుమారి, రాజేష్, అచ్చిబాబు, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు బాబు మార్క్ మోసం

- కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులుగా మారిన యువత
- రోడ్డున పడ్డ వలంటీర్లు, మద్యం దుకాణాల ఉద్యోగులు, ఎండీయూ ఆపరేటర్లు

యలమంచిలి: బాబొస్తే జాబు వచ్చే మాట ఎలా ఉన్నా.. బాబు వచ్చాక చేస్తున్న ఉద్యోగాలు కూడా పోవడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. అధికారమిస్తే ఇంటికో ఉద్యోగం..లేకుంటే నిరుద్యోగ భృతి అని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన తెలుగు తమ్ముళ్లు అధికారం చేజిక్కించుకున్న తరువాత ఇచ్చిన మాటను అటకెక్కించారు. పైగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులపై వేధింపులు అధికమయ్యాయి. బాబు వస్తే జాబు గ్యారెంటీ అని, లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నిండా ముంచేశారు. అధికారం చేపట్టి సంవత్సరం దాటినా కొత్త ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేకపోగా, చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించి వారి పొట్టకొట్టారు. వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది చిరుద్యోగులు, నిరుద్యోగుల పరిస్థితి. బాబు వస్తే అభివృద్ధి పరుగులు పెట్టిస్తాడని, ఉద్యోగాలు వస్తాయని టీడీపీ ఊరూరా గడప గడపకూ తిరిగి మరీ గత ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ, అధికారంలోకి అడుగు పెట్టిన వెంటనే సీఎం చంద్రబాబు కుట్ర బట్టబయలైంది. మోసం చేయడం తన నైజం.. నమ్మి మోసపోవడం మీ తప్పు అన్నట్లుగా ఉద్యోగుల పనిబట్టారు. ఒక్కొక్కటిగా ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో పడ్డారు.

అటకెక్కిన వలంటీర్ల హామీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవంతంగా అమలు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశవ్యాప్తంగా ఎంతో పేరుపొందింది. ఈ వ్యవస్థను అలాగే కొనసాగిస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా గెలిచాక వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేదంటూ తొలగించారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. జీతం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికి చివరకు ఆ ఐదు వేలు కూడా లేకుండా చేశారు. దీంతో కూటమికి ఓటు వేసి మోసపోయామంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో కొన్ని చోట్ల ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను, మధ్యాహ్న భోజన కార్మికులను బలవంతంగా తప్పించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు చేతనైంది చేసుకోండంటూ స్థానిక నాయకులు బెదిరిస్తున్నారు. దీంతో వేలాది మంది ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయి బతుకుదెరువు లేక అల్లాడిపోతున్నారు.

ఇంటింటికీ రేషన్ రద్దుతో ఉపాధికి చేటు



కనకాయలంకలో వలంటీర్ ఉద్యోగం పోవడంతో తాపీపని చేసుకుంటున్న సీతారామరాజు

వయస్సు పైబడి రేషన్ షాపునకు వెళ్లలేని వారు, దివ్యాంగులకు ఉపయుక్తంగా ఉన్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు రద్దు చేశారు. ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో డ్రైవర్లు, ఆపరేటర్లకు జీవనోపాధి లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలకు వీలు కల్పించడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు రోడ్డున పడ్డారు. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టకపోతే చాలంటూ ఉద్యోగులు, ప్రజలు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

> **పారదర్శకంగా పని చేశాం**
>
> 
>
> ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిలా పారదర్శకంగా పనిచేశాం. కోవిడ్, వరదల సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించాం. మంచి పనులు చేస్తూ అందుకుంటున్న చిన్నపాటి గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం మాకు దక్కకుండా చేయడం సమంజసం కాదు.
>
> – ఉచ్చుల ఫిలిప్, పెదలంక

> **ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి**
>
> 
>
> వలంటీర్లకు ఎన్నికల సమయంలో గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీరు వ్యవస్థను తొలగించడంతో ఖాళీగా ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం అమలు చేయాలి.
>
> – పాలపర్తి సందీప్, ఏనుగువానిలంక

ఆగని ప్లాస్టిక్ వాడకం

ఆకివీడు: ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. ప్లాస్టిక్ వినియోగం వద్దు అంటూ ప్రభుత్వం, అధికారులు విస్తృత ప్రచారం చేసినప్పటికీ ప్రజల్లో వినియోగం మరింతగా పెరిగింది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్డు మార్జిన్లు, డ్రెయిన్లు, పంట, మురుగు కాలువల్లో పేరుకుపోతున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో మరింతగా తిష్టవేస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని అంతమొందించాలని అధికారులు తాటాకు చప్పుళ్లు చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కూరగాయల దుకాణాల్లో, పండ్లు, ఇతర పచ్చి వ్యాపారాల్లోనూ, కిరాణా, బడ్డీ కొట్లు, బిర్యానీ సెంటర్లు, కాఫీ హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉంది. స్థానిక నగర పంచాయతీ అధికారులకు కోపం వచ్చినప్పుడల్లా కూరగాయల దుకాణాలపై పడి ప్లాస్టిక్ కవర్లు పట్టుకుపోతున్నారు. అనంతరం ఫైన్లు వేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో కూడా టీ అమ్ముతున్నారంటే ప్లాస్టిక్ వినియోగం ఎంతగా ఉందో అర్థమవుతోంది. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్ల అమ్మకాలు యథేచ్ఛగాకొనసాగుతోన్నాయి. వాటి వినియోగం, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.



అయిభీమవరం టర్నింగ్ వద్ద డ్రెయిన్‌లో పేరుకు పోయిన ప్లాస్టిక్, సింగిల్ యూజ్ వ్యర్థాలు

ప్రతిఒక్కరూ జాతీయ భావంతో మెలగాలి

భీమవరం: స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం వైపు ప్రజలంతా అడుగులు ముందుకు వేయాలని, ప్రతిఒక్కరూ జాతీయ భావంతో మెలగాలని రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీ విజ్ఞానవేదిక, క్విట్ ఇండియా స్థూప పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడులక పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మన దేశంపై మమకారంతో జాతీయతా భావాన్ని మనసులో నింపుకోవాలని, నేటి తరానికి స్వాతంత్ర స్ఫూర్తిని తెలియచెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. భీమవరంలో 1942 ఆగస్టు 17న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో భూపతిరాజు సుబ్బ తాతరాజు, దంతులూరి నారాయణరాజు, అడవి బాపిరాజు, గొట్టుముక్కల రామచంద్రరాజు లాంటి వారి నాయకత్వంలో ఆనాడే స్వాతంత్ర్యం వచ్చినట్లు ఉద్యమం సాగించారని గుర్తు చేశారు. పక్షోత్సవాల కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్విట్ ఇండియా స్థూపం ప్రధాన ద్వారాలకు దాతలను కోరామని, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశి విశ్వనాథరాజు ముందుకు వచ్చారని, బుద్ధిని కాంస్య విగ్రహాన్ని ఏఎస్ఆర్ రాజు చారిటబుల్ ట్రస్ట్, వసుధ ఫౌండేషన్, రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ కృష్ణ మోహన్ అందిస్తున్నారని అన్నారు. అనంతరం పక్షోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసా పత్రాలను అందించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు గొట్టుముక్కల పద్మావతి, రుద్రరాజు కృష్ణంరాజు, పాలకోడేటి కార్తీక్, మ్యాజిక్ స్టార్ బోస్, దేశభక్తులు వడ్డీ సుబ్బారావులను ఎంపీ సత్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, ఇందుకూరి ప్రసాద రాజు, బీజేపీ నాయకులు అల్లూరి సాయి దుర్గరాజు, కోమటి రవి, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

క్రిస్టియన్ మిషనరీ ఆస్తుల్ని కాపాడుతాం

ఆకివీడు: క్రిస్టియన్ మిషనరీ ఆస్తుల్ని కాపాడుకుందామని, ఆస్తుల్ని విక్రయించి, క్రిమినల్ కేసుల్లో ఉన్న వ్యక్తుల మాటలు నమ్మవద్దని ఈస్టు ఫీల్డ్ కౌన్సిల్ చైర్మన్ కుర్రెళ్ల రవి ప్రకాష్ అన్నారు. స్థానిక సీబీసీఎన్‌సీ చర్చిలో భారతదేశంలో మొట్టమొదట సువార్త అందించిన వ్యక్తి, దేశంలో సంస్కరణలకు కృషి చేసిన విలియం కేరీ 264వ జయంతిని స్థానిక చర్చిల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ క్రిస్టియన్ల కోసం ఆనాడే విదేశీయులు ఆస్తులు సమకూర్చారన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సంఘ లీగల్ అడ్వైజర్‌గా విశ్రాంతి డిప్యూటీ కలెక్టర్ బీజే కృపాదానం సలహాలతో ముందుకు వెళ్లతామని చెప్పారు. ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి జి.జోసఫ్‌రాజు, కోశాధికారి జి.సుందర్ సింగ్, కన్వీనర్ సదర్ల జక్కరయ్యలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు యాళ్ళ ప్రసంగి, కార్యదర్శి గోడి రాజభూషణం, సీఆర్ వీజే కోటేశ్వరరావు బాబు, బొడ్డు వజ్రం తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సీబీసీఎన్‌సీ చర్చిలో ఫీల్డ్ కౌన్సిల్ కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

వీరవాసరం: గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం గ్రామ శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో బాలం విజయకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ బొర్రా అలమహారాజు మాట్లాడుతూ మండల కేంద్రమైన వీరవాసరంలో అనేక సమస్యలు ఉన్నాయని మేజర్ సమస్యగా ఇళ్ల స్థలాల సమస్య ఉందన్నారు. అభివృద్ధిని గురించి గొప్పగా మాట్లాడుతున్న పాలకులు కనీసం ఇళ్ల స్థలాలు, తాగునీరు, రోడ్లు వేయలేని స్థితిలో ఉన్నారని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ స్థానిక సమస్యలను గాలికి వదిలేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, రెడ్డి రాము, ఎండమూరు సుబ్బారావు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలమహారాజు

గులాబీ పూలతో శ్రీకృష్ణునికి అలంకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని 17వ వార్డు బంట్రోతు వారి వీధిలోని శ్రీ వేణుగోపాల స్వామి మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వారిని గులాబీ పూలతో అలంకరించారు. ఆలయ కమిటి పర్యవేక్షణలో పట్టణానికి చెందిన వెలివిలి కృష్ణ దంపతులత ఆలయ అర్చకులు శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గులాబీ పూలతో పూజ చేసి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

ఉట్టి కొట్టిన చిన్నారులు

స్థానిక మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానం వద్ద ఆదివారం చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మద్దాల సత్యనారాయణ, లక్ష్మీ బ్రహ్మాజీ దంపతులతో ఆలయ అర్చకులు 11 కృష్ణుని విగ్రహాలకు కృష్ణ పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో కోలాహలంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి బహుమతులను అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న ఉప్పలూరు జెడ్పీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు

భీమవరం: ఉండి మండలం ఉప్పులూరులోని యర్రా చంద్రరావు, ఆండాళ్లమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించినట్లు ఆ పాఠశాల (1986 బ్యాచ్) పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక యూత్ క్లబ్‌లో ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు (సుభాష్) మాట్లాడుతూ 2026, జనవరి 11వ తేదీన తమ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. ఈ సమ్మేళనం సందర్భంగా తమ గురువులను సన్మానించాలని, అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం చేయాలని ఈ సమావేశంలో తీర్మానించామన్నారు. ఇందుకుగానూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తమ స్నేహితులను గుర్తించి ఇప్పటికే వారికి సమాచారం ఇచ్చామన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బైర్రాజు నరసింహ రాజు, నంబూరి శ్రీనివాస రాజు, కూనపరాజు శ్రీనివాసరాజు, నారాయణ శ్రీనివాస గుప్త, యర్రా కేశవరావు, గంగుమోలు సీతారామయ్య, రుద్రపాక విశ్వేశ్వర శర్మ, కాకర్లమూడి రమేష్ బాబు, చింతలపాటి ప్రమీల, దెందుకూరి అన్నపూర్ణ, ఆలమూరి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.